క్లుప్తంగా

ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడం దారుణం



కొత్తూరు: రేషన్ షాపులు నుంచి ప్రతి ఇంటికీ నేరుగా రేషన్ సరుకులు అందజేసే ఎండీయూ వాహన వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మరలా లబ్ధిదారులు గతంలో మాదిరిగా రేషన్ షాపులు వద్ద గంటలు తరబడి క్యూలో ఉండాల్సిన దుస్థితి వస్తుందన్నారు. అదేవిధంగా ఎండీయూ వాహనదారులకు ఉపాధి లేకుండా ప్రభుత్వం చేసిందని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని మండిపడ్డారు.


ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామానికి చెందిన బలివాడ శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబానికి గ్రామ ఉప సర్పంచ్ కరణం అనిల్‌నాయుడు ఆధ్వర్యంలో తనతో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. కొంతమంది కలిసి బుధవారం రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, వాసుదేవరావు, మాజీ వైస్ సర్పంచ్ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



హతమైన కొండచిలువ

పొందూరు: మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామానికి దగ్గరలో ఉన్న పైడికొండ నుంచి గ్రామంలోకి ప్రవేశించింది. మొకర గోపి డాబా మీదకు మెట్లుపై నుంచి ఎక్కింది. గోపి కుమార్తె చదువుకునేందుకు డాబా మీదకు వెళ్లగా, కొండచిలువ కనిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి తండ్రికి చెప్పింది. దీంతో స్థానికులు డాబా ఎక్కి కొండచిలువను హతమార్చారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొందూరు: మండలంలోని కల్యాణపేట సమీపంలో నయారా పెట్రోల్ బంక్ వద్ద అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రణస్థలం అగ్నిమాపక అధికారి పి.అశోక్ వివరించారు. పెట్రోలు బంకుల్లో అగ్ని ప్రమాదాలు, ఇంట్లో గ్యాస్ సిలిండర్ల వాడకం జాగ్రత్తల గురించి ప్రజలకు, పెట్రోలు బంక్ సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పొందూరు అగ్నిమాపక సిబ్బంది ఎ.రామకృష్ణ, బి.ధర్మారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరు కాలేజీ రోడ్డులో స్థానిక ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు గతంతో విధించిన జరిమానాలను వసూలు చేయించారు. అలాగే సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోయిన వాహనాలకు ఫైన్ వేశారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ లైన్ పనులు అడ్డగింత


పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ శివానీనగర్ మీదుగా చేపట్టిన విద్యుత్ లైన్ విస్తరణ పనులను స్థానిక ప్రజలు బుధవారం అడ్డుకున్నారు. విద్యుత్ శాఖ 33 కేవీ పనులు చేపట్టడంతో రహదారి వెడల్పు తగ్గిపోతోందని, నివాసాలకు అత్యంత చేరువుగా లైన్లు వెళ్లే కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు దూరదృష్టితో ఆలోచించి, విస్తరణ పనులు వేరే మార్గం ద్వారా చేపట్టాలని కోరారు.

చార్ ధామ్ యాత్రలో అపశృతి

నరసన్నపేట: స్థానిక శ్రీరామ్‌నగర్‌కు చెందిన జామి శ్రీధర్(54) చార్ ధామ్ యాత్రలో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు. వారం క్రితం యాత్రకు భార్యతో సహా శ్రీధర్ స్థానికులతో కలిసి వెళ్లారు. బద్రీనాథ్ వెళ్తుండగా బస్సులోనే బుధవారం సాయంత్రం గుండెపోటుకు గురై మరణించారు. మృతదేహాన్ని నరసన్నపేటకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

బీమా.. ఏదీ ధీమా..?

- అమలుకు నోచుకోని చంద్రన్న బీమా
- దరఖాస్తులు స్వీకరించని వైనం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో ఆసరా



వైఎస్సార్‌సీపీ హయాంలో బీమా చెక్ అందిస్తున్న దృశ్యం (ఫైల్)

సారవకోట:

ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా వాటి అమలును మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం కుటుంబాల్లో చనిపోయినవారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకాన్ని కూడా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా కుటుంబ పెద్దను కోల్పోతే పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల్లో 18 నుంచి 50 సంవత్సరాల్లోపు వారు ఎవరైనా మృతి చెందితే రూ.5 లక్షలు చొప్పున వైఎస్సార్ బీమా మంజూరు అయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. మిగతా సొమ్ము 15 రోజుల్లో బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. ఈ బీమా సొమ్ము కోసం ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టేది. తద్వారా కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతీ పేద కుటుంబానికి సత్వర సాయం అందేది.

నరసన్నపేట నియోజకవర్గంలో...

నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2019 నుంచి 2024 వరకు 262 కుటుంబాలకు పరిహారాన్ని గత ప్రభుత్వ హయాంలో అందజేశారు. అయితే అనంతరం జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా ఈ పథకాన్ని ఇంత వరకు వర్తింపజేయలేదు.

పేరు మార్పుతోనే సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకం పేరును చంద్రన్న బీమాగా పేరు మార్చి దాని అమలును మాత్రం గాలికొదిలేశారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలను మభ్యపెట్టే మాటలు చెప్పారు. అయితే గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు బీమా సొమ్ము మాత్రం అందడం లేదు.

ప్రారంభమవ్వని వెబ్‌సైట్

2024 మే తర్వాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్ తొలగించింది. ఆ తర్వాత కొత్తగా పేరు పెట్టినా చంద్రన్న బీమా వెబ్‌సైట్ మాత్రం ప్రారంభించలేదు. బీమా నమోదు చేయలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి క్లెయిమ్స్ స్వీకరించేందుకు మార్గదర్శకాలను ఇవ్వలేదు. బీమాపై దరఖాస్తులు స్వీకరించేందుకు నేటికీ ఎలాంటి ఆదేశాలు లేవని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో ఆయా కుటుంబ యజమానులను, కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు బీమా సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు.

బీమా మంజూరు చేయాలి



బడుగు బలహీన వర్గాల కుటుంబాల్లో మృతి చెందినవారి కుటుంబాలకు చంద్రన్న బీమా కింద మంజూరు చేస్తామన్నా బీమా సొమ్మును ప్రభుత్వం మంజూరు చేయాలి. బీమా సొమ్ము కోసం బాధిత కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఎంతైనా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబాల ఇంటికెళ్లి బీమా సొమ్ము ఇవ్వడం జరిగేది.

– నక్క తులసీదాస్, బుడితి, సారవకోట

ఎటువంటి గైడ్‌లైన్స్ లేవు

చంద్రన్న బీమాపై ప్రభుత్వం నుంచి ఎటువంటి గైడ్‌లైన్స్ ఇప్పటివరకు రాలేదు. అందువలన మేము దరఖాస్తులు స్వీకరించడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుంది.

– శ్రీనివాసబాబా, ఏపీఎం, సారవకోట

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



నరసన్నపేట: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చికిత్స శిబిరంలో 20 మందిని కంటి ఆపరేషన్లకు గుర్తించినట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ జానకిరామయ్య తెలిపారు. వారికి జెమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని చెప్పారు. ఆపరేషన్ సమయంలో ఉచిత భోజనం, మందులు, ఉచిత రవాణా అందించడం జరుగుతుందన్నారు.

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 27 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యురాలు గొలివి సుజాత తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు షాలిని, ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాలగంగాధరరాజు, సూపర్‌వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.చంద్రకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పేదలపై ప్రభుత్వం కక్ష సాధింపు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలోనే పేద కుటుంబాలపై కక్ష సాధింపు చర్యలకు దిగిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రేషన్ వాహనాలను నిలిపివేస్తే మరలా రేషన్ డిపోల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేస్తే రేషన్ కార్డుదారులు జగనన్న పేరు తలచుకుంటున్నారని, అందుకే చంద్రబాబు ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా, వైఎస్సార్‌సీపీ అమలు చేసిన పథకాలకు మంగళం పాడుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు.

కిక్కిరిసిన రోడ్డు



మాకవరం రహదారిపై నిలిచిన వాహనాలు

కొత్తూరు: మండలంలోని మాకవరం గ్రామ రహదారి బుధవారం జనసంద్రమైంది. ఉత్సవాలు ముగియడంతో గ్రామం నుంచి ప్రజలందరూ ఒకేసారి ప్రయాణమవ్వడంతో రహదారులు వాహనాలతో నిండిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తన సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ



సారవకోట: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

సారవకోట: మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహానికి అరటి పండ్లతో ప్రత్యేకంగా బుధవారం అలంకరించారు. గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అరటి గెలలు సమకూర్చడంతో స్థానిక హనుమాన్ భక్త సమాజం సభ్యులు అలంకరించారు.

అన్నప్రసాద వితరణ నేడు

ఆమదాలవలస: పట్టణంలోని మోనింగివారి వీధిలో అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్, హరిబాబులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అందరూ స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

రైతన్నా జాగ్రత్త..!

- విద్యుత్ మోటార్లతో తరుచూ ప్రమాదాలు
- అవగాహన అవసరమని సూచనలు



వ్యవసాయ విద్యుత్ మోటారు

సరుబుజ్జిలి: ఈ ఏడాది అనుకున్న సమయానికంటే ముందే అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ పనులకు సమాయత్తమవుతున్నారు. అయితే వ్యవసాయ పనుల్లో బిజీగా మారుతున్న రైతులు తాము వినియోగించే విద్యుత్ మోటార్లు వలన తరుచూ ఏర్పడుతున్న ప్రమాదాలపై అప్రమత్తంగా లేకపోవడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అందువలన విద్యుత్ మోటార్లు, పరికరాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో అధికారులు సూచిస్తున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మృత్యువు విద్యుత్ తీగల రూపంలో కాటేస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా పొలాల్లో వేలాడే తీగలు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లుతేలిన స్టార్టర్ పెట్టెలు, మోటార్లకు కట్టిన తీగలు వలన ప్రమాదాలు జరుగుతుంటాయని చెబుతున్నారు. అందువలన విద్యుత్ పంపిణీలో ఏమాత్రం ఇబ్బందులు ఏర్పడినా సొంత ప్రయోగాలు చేసి ప్రాణాలు మీదకు తెచ్చుకోకుండా, విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

ఇలా చేయండి

- మోటార్లకు రక్షణ కవచం ఏర్పాటు చేయాలి.
- వ్యవసాయ మోటార్లు కొనుగోలు చేసే సమయంలో నాణ్యతను పరీక్షించాలి.
- నాణ్యత లేని మోటారు కొనుగోలు చేస్తే సింగిల్ ఫేజ్ తీగకాలినా మోటారు మొత్తానికి విద్యుత్ సరఫరా జరుగుతుంది. అటువంటి సమయంలో విద్యుత్ మోటారును రైతులు తాకితే ప్రమాదం జరుగుతుంది.
- మోటారుకు రక్షణ కవచం ఏర్పాటు చేసి వర్షానికి తడవకుండా తేమ లేనిచోట ఎర్త్‌వైర్‌ను ఏర్పాటు చేయాలి.
- మోటారు మరమ్మతులకు గురైతే వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.
- విద్యుత్ పనులు పొడిగా ఉండే ప్రదేశంలో చేపట్టాలి.
- స్టార్టర్లు తేమలేనిచోట ఉంచి నేరుగా విద్యుత్ సరఫరా కాకుండా ఫ్యూజ్ క్యారియర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- సగం తెగిపడిన తీగలపై అప్రమత్తంగా ఉండాలి.
- నాణ్యమైన సర్వీస్ వైర్ ఎంపిక చేసుకోవాలి. ముక్కలు తెగిన వైర్లు అతకరాదు. వైర్లు తేమలో తడిసిపోకుండా ఇన్సులేటర్లు ఏర్పాటు చేసుకోవాలి
- విద్యుత్ పోల్స్, మోటార్లు చుట్టూ పచ్చని పొదలు, చెట్లు లేకుండా చూసుకోవాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాలు పడే సమయంలో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉంటూ విద్యుత్ తీగలు, మోటార్ల వద్ద ప్రమాదాలు బారిన పడుతున్నారు. అందువలన విద్యుత్ సరఫరాకు సంబంధించి నాణ్యతతో కూడిన పరికరాలు వినియోగించాలి. మరమ్మతులకు గురైనవాటిని వాడరాదు. వైర్లు అతుకులు లేకుండా చూసుకొని సాధ్యమైనంతవరకు కొత్తవాటిని ఉపయోగించాలి. కాళ్లు, చేతులు పొడిగా ఉండేటట్లు చూసుకోవాలి.

– పైడి యోగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఈఈ, సరుబుజ్జిలి

గోతులమయం



సారవకోట మండల కేంద్రం నుంచి కిడిమి వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో నీరుచేరి ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సారవకోట

శిథిలావస్థ



బూర్జ మండలంలోని పాలవలస గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం చేపట్టిన ఈ భవనాన్ని కూల్చివేసి, దీని స్థానంలో నూతనంగా భవన నిర్మాణం చేపట్టాలని విన్నవిస్తున్నారు. గ్రామానికి ముందరగా ఉండడంతో పాటు అక్కడ పిల్లలు ఆడుతుంటారని, అందువలన ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– బూర్జ

ఖరీఫ్‌కు సన్నద్ధం



ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఎల్.ఎన్.పేట మండలంలో 12,850 ఎకరాల సాగు విస్తీర్ణం కాగా, సుమారు పది వేల ఎకరాల్లో వరి వెదలు వేసుకుంటారు. దీనికోసం ప్రస్తుతం బిజీబిజీగా వ్యవసాయ పనుల్లో ఉన్నారు.

– ఎల్.ఎన్.పేట

పనిచేయని షట్టర్లు



వంశధార కుడి ప్రధాన కాలువతో పాటు, పిల్ల కాలువలకు ఏర్పాటు చేసిన షట్టర్ల నిర్వహణ సక్రమంగా చేయడం లేదు. చెక్‌డ్యామ్‌లు, షట్టర్లకు మరమ్మతులు చేయకపోవడం వలన సాగునీటిని నిల్వ చేయడానికి అవకాశం లేకుండాపోతోంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో చుక్కనీటి కోసం నానా కష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

– సరుబుజ్జిలి

క్లస్టర్ పాఠశాలలకు మెటీరియల్ పంపిణీ



మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పొందూరు: మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని 20 పాఠశాలలకు అవసరమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను క్లస్టర్ చైర్మన్ బల్ల కంటయ్య బుధవారం అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్ నిధులు రూ.25 వేలతో మెటీరియల్‌ను కొనుగోలు చేశామన్నారు. వీటితో పాటు రూ.14,500లు విలువ చేసే మెగాఫోన్, రూ.27 వేలతో కంప్యూటర్ సిస్టమ్‌ను స్కూల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు తమ్మినైన విభీషణరావు, కూన మల్లేశ్వరరావు, సప్పటి సత్తిరాజు, గండెం రామారావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



మాట్లాడుతున్న ఎంటీ సూర్యనారాయణ

కొత్తూరు: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ఎంటీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని సిరువాడలో ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం వలన భూమిలో తేమ ఎక్కువ రోజులు ఉంటుందని చెప్పారు. కలుపు నివారణ జరుగుతుందని పేర్కొన్నారు. ఇంతవరకు ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రుతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహాలక్ష్మి, రమణమ్మ, సునీత, బాలకృష్ణ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.